


# 4

## తల్లావఝ్ఝల పతంజలిశాస్త్రి

# నలుపెరుపు

కార్తీకం మంచు పిడికిలి బిగించింది. చర్మాలు బిగుసుకుంటున్నాయి. గాలి ఒంటిని చీరేస్తోంది. తలచుట్టూ సన్నటి గుడ్డ గట్టిగా చుట్టుకుంది రత్నం. నొప్పి తగ్గడం లేదు. ఉదయపు పొగమంచు గుడ్డు ఆదివారాన్ని పొదిగింది. పాత తాటాకు, చెత్తా చెదారం మండుతూంటే ఒంటినిండా కప్పుకుని వెచ్చబడుతోందామె. రత్నం చుట్టూరా గుడిశలు, చిన్న పెంకుటిళ్లు. వీధి చివర బాబాగారి ఒంటిగది గుడి. అన్నీ మంచు పొగమాయలోంచి బయటపడుతున్నాయి. ఇంట్లో జమీలు దుప్పటి కింద సారాయి సీసాలా నిద్రపోతున్నాడు; మూతలేని సీసాలా నోరు తెరచి మరీ. ఒంటిమీద కాసిని ఉడుకు నీళ్లోసుకుని గోడకతికిన అద్దంలో బొట్టుబిళ్లనతికించుకుని బయటపడింది రత్నం.

గుర్రు పెడుతున్న జమీలు శవం మీద ఉమ్మేసి మరీ వెళ్లింది. వెళ్లగానే మంచి వేడి టీ చేసుకోవచ్చు. మళ్లీ ఉప్మా తిని సుగరెక్కిన టీ తాగితేగాని తలపోటు తగ్గదు. నల్లగేటు తోసుకుని ఇంటి పక్కవేపునుంచి వెనక్కి వెళ్లింది రత్నం. చెప్పులు దూరంగా విడిచి కాళ్లూ చేతులూ కడుక్కుని వెనక తలుపు తీసుకుని లోపలికి వెళ్లిందామె. లోపల గదులన్నీ ఒక్కో గదీ ఒక్కో రంగులో ఉంటాయి. గది నేలలు కూడా అంతే. ఆమె సోఫాలో కూచుని పేపరు చూస్తోంది. లోపలి వెచ్చటి సుఖంలో రత్నం తలనొప్పి ఎక్కువయింది. నేలమీద మోపిన ఆమె పాదం తెల్లటి పువ్వులా ఉంది. క్షణం ఆగి చూసిందామెని. రాత్రి ఫొటోలాగ ఈ

యమ్మ బట్టల్లేకుండా సోఫాలో కూచున్నట్టనిపించి రత్నం కళ్లు పెద్దవయ్యాయి. ఎదవ ఫొటోలు. ఆమె కూచునే రెండు చేతులూ పైకెత్తి ఒళ్లు విరుచుకొని అద్దం పలక బల్లమీది గులాబీరంగు కాఫీకప్పు చేతిలోకి తీసుకుంది. ఆమె కళ్లింకా బద్ధకంగానే ఉన్నాయి. నిద్రచేతుల్లో నలిగిపోయిన ఒళ్లు.

"తలకేవైందే?"

"కొట్టేడమ్మ ఎదవ."

"గట్టి దెబ్బగాని తగిలిందా?"

"సస్తే పీడాబోద్దండి."

"నీ మొహం. టీ చేసుకో బిళ్ళిస్తాను. నీకు వాడు తప్ప ఎవడూ దొరకలేదు."

రత్నం వంటింట్లోకి వెళ్లి సింకులో పడున్న మూడుగిన్నెలూ తోమి గాజు అలమరలో జాగ్రత్తగా తుడిచిపెట్టింది. గేసు పొయ్యి వంట చెయ్యకముందూ చేసిన తరవాతా ఒక్కలాగే ఉంటుంది. అమ్మగారు స్నానం చేసినా చెయ్యకపోయినా ఒకేలా ఉంటారు. నాకులాగ ఆడు అమ్మగారి తొడ గిల్తే పుండయిపోతుంది. ("ఇదేం రోగం, గిల్తావేంది?") పొయ్యి తుడిచి ఎర్రబకెట్‌లో నీళ్లు పోసి నాలుగు చుక్కల ఫినోలు వేసి కర్రగుడ్డలో ఓ సారి కదిపి వంటగది నేల తుడవడం మొదలుపెట్టింది రత్నం. తల వంచితే రెండు వక్కలయ్యే నొప్పి. అద్దాలు, నేల, పొయ్యి, గట్టు, గిన్నెలు ఎప్పుడూ మెరుస్తూంటాయి. గ్రైండర్ల మీద కవర్లు ఒకసారి దులిపిపెట్టి ఆకుపచ్చ రంగులో మెరుస్తోన్న ఫ్రిజ్‌ని తెల్లగుడ్డతో తుడిచింది రత్నం. లోపల హాయిగా వెచ్చగా వుంది. జమీలు ఇంకా లేచి ఉండడు. పైన ఫేను తెల్లగుండ్రంలా తిరుగుతోంది. ట్యూబ్‌లైటు వెలుగులో నేలమీద తన నీడ కనిపిస్తోంది. మళ్లీ చేతులు కడుక్కుని టీ నీళ్లు పెట్టి ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలు స్టీలుగిన్నెలో వేసుకుని హాల్లోకి వెళ్లింది. అమ్మగారు హాల్లో లేరు. పలక బల్లమీద గిన్నె పెట్టి నుంచోగానే ఆమె లోపల్నించి వచ్చింది. "ఇవాళ నలుగుపెట్టుకుని తలకి పోసుకుంటాను. గదులిప్పుడు తడిగుడ్డ పెట్టకు." అందామె.

తలూపింది రత్నం. ఆమెకి మాట్లాడాలని లేదు. బంతిపువ్వు రంగు మెత్తటి తువ్వాల్తో సోఫాలో కూచుని ముఖం తుడుచుకుందామె. రెండు బుగ్గలూ కందిపోయాయి. ఇనప్పిడికిలి బిగించి కసికొద్దీ కణతమీద కొట్టాడు. జుట్టు పట్టుకుని గుంజి మంచంమీదికి తోశాడు. తల మంచం బద్దీకి తగిలింది. రత్నం వంటింట్లోకి వెళ్లింది. ఆటోలో తిప్పి బెజవాళ్లో సినిమాలకి తీసికెళ్లి భవానీపురంలో గర్భిణీనిజేసి దుర్గమ్మ కొండకింద మంత్రసానింట్లో గర్భం తీయించాడు జమీలు. ఇక్కడికి లేపుకొచ్చిన కొత్తల్లో బాగానే ఉండేవాడు. తాగుడలవాటు చేసుకుని తిట్టడం, చెయ్యి చేసుకోవడం, మీద పడి కొరకడం. ఇంతెదవనుకోలేదు.

తోపుకి కిందపడి తలవాల్చేసి కావాలని పక్కకి తిరిగిపడిపోయింది. ఒంటిమీద గుడ్డలేదు. కాళ్లు ముడుచుకుంది. దగ్గిరికొచ్చేడు జమీలు. చచ్చిపోయిందేమో అన్నాడు వానపాము. "మరీ మంచిది. చావదుగానీ ఆ మూల్నించి ఫోటోల్లాగు. దీన్ని మంచం మీదికి లాగుతా.

"జమీలు రత్నం నడుంకింద చెయ్యేసి మోకాళ్ల కింద మరో చెయ్యేసి లేపాడు. మరుగుతున్న నీళ్లలో ఎర్రనూక వేసింది రత్నం. మళ్లీ కాస్త టీ తాగి గ్లాసు సింకు గట్టుమీద పెట్టి హాల్లోకి వెళ్లింది. తల వెనక్కి వాల్చి కళ్లు మూసుకుని ఉందామె. మెత్తటి వెన్నలాటి ముక్కుకి నెత్తుటిబొట్టులాంటి ముక్కుపుడక. పైట సగం జారిపోయింది. కడుపు మెత్తగా ముడతలుపడింది. ముద్దొస్తున్నాయి. నొప్పి జూసుకోడు. కొరకడవే. జమీలవన్నీ ఈయమ్మ మీద చేస్తే రక్తపుముద్దయిపోద్ది. ముట్టుకుంటేనే కందిపోతుందీవె. కళ్లు తిరిగినట్టయింది రత్నానికి.

"ఫ్రిజ్‌లో కూరలేవున్నాయో చూడు. ఇక్కడే తిని వెళ్లు." అందామె.

రత్నం లోపలికెళ్లి ప్లేటు ఉప్మా చెంచా సన్నటి నిమ్మబద్దా పెట్టి తెచ్చింది.

"టిఫిన్చేసి కుంకుడు కాయలు కొట్టు."

లోపలికెళ్లి ప్లేటు ఉప్మా పెట్టుక్కూచుంది రత్నం. కడుపు ఖాళీగా మండుతోంది. కళ్లు చెమ్మగిలేయి. రాత్రి ఎనిమిది దాటితే ఆటో తిప్పేవాడు కాదు. ఆదివారం తాగేవాడు. మూడుగదుల పెంకుటిల్లు బాగుండేది. టీ.వీ. ఉండేది. 'సినిమా హీరోయినువే నువ్వు. అవెహ్మా. నిన్నివ్వాళ బొంబాయిలో అమ్మేసినా లక్ష రూపాయిలిస్తారు. మా కాసింగాడికిదే పని.' 'ఆ ఎదవని ఇంటికి దెచ్చేవనుకో ఆడికీ నీకూ కాళ్లిరగ్గొడతాను'.

ములక్కాడలు తరిగింది. మీల్ మేకరు నీళ్లల్లో పడేసింది. మూడు గుడ్లు పొయిమీద పెట్టింది. కుంకుడు కాయలు కొట్టి గోరువెచ్చటి నీళ్లలో వేసింది రత్నం.

మరో గంటలో వంటయిపోయింది. మళ్లీ టీ తాగి బిళ్ల మింగింది రత్నం. తలనొప్పి తగ్గడం లేదు. ఒంటి మీద పాము పాకుతున్నట్టుంది. పొయ్యేకాలం వచ్చి పాడుబుద్దులుపుడుతున్నాయి. లేచొచ్చానని. కట్టుకుందయితే తడిచెప్పుతో కొట్టేది. ఎదవ కొడుకు. ఆరువరకూ చదివింది. అయినా తెలవలేదు. వేడి మరుగుతోన్న ఏడుపు తన్నుకొచ్చింది. అమ్మగారు నీలం రంగు నైటీ మార్చుకుంది. రెండు చిన్న స్టీలు గిన్నెల్లో రెండు పొట్లాలిచ్చి వెయ్యమందామె. ఏ బాదా లేదు. తలంటుకోడం హాయిగా పడుకోడం. ఒక్కో పొట్లం విప్పుతుంటే కమ్మటి వాసనలు రత్నాన్ని కమ్ముకున్నాయి. కానిసి నీళ్లు పోసి కలిపిందామె. కలిపేకొద్దీ వట్టివేళ్ల, నిమ్మపరిమళం వ్యాపిస్తోంది. తలపోటు ఎక్కువైంది. "బాత్రూంలో పెట్టి రా. ఇప్పుడే వస్తాను."

రత్నం పడగ్గదిలోకి వెళ్లి చాక్లెట్ రంగు స్నానాల గది తలుపులేసింది. ముగ్గురు కాపురం ఉండొచ్చు. ఏదో పల్చటి సువాసన గోడలకి అంటుకుని ఉంది. ఓ పక్క రెండడుగుల ఎత్తులో లేతనీలం పాలరాయి స్నానాల తొట్టి, నేల మీద తెల్లటి పాలరాయి. కుళాయిలు తళతళలాడుతున్నాయి. తలుపు పక్కగోడకి ముదురు చాక్లెట్ రంగు సింకు, దానిమీద అద్దం. కుళాయి పక్క గోడలో ఉన్న గాజు అలమరలో గిన్నెలుపెడుతూ స్టీలుపెట్టెలో ఆకుపచ్చ సబ్బు చూసింది రత్నం. అమ్మగారి తెల్లటి ఒంటితో గాఢ పరిచయం వల్ల సబ్బు బాగా అరిగిపోయింది. మహా అయితే మరో రెండు మూడుసార్లు అలుముకుని ఆమెలో కలిసిపోతూంది.



హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కవి సరికొండ నరసింహరాజును ఉగాది విశిష్ట పురస్కారంతో సత్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. చిత్రంలో ఆచర్య పి. చెన్నారెడ్డి, డా॥ వి.వి.విఎల్. నరసింహమరావు, రఘుశ్రీ.

అప్రయత్నంగా సబ్బుబిళ్ల తీసుకుని వాసన చూసిందామె. ఆమెకెప్పుడూ అటువంటి పరిమళం ఉంటుందని తెలీదు. కళ్లు బైర్లుకమ్మాయి. వెంటనే ఒంటికి రాసుకోవాలనిపించింది. సబ్బు పెట్టెలో పెట్టి వెనక్కి తిరిగింది రత్నం.


సింకుమీది అద్దంలో తన ముఖం కనిపించింది. చామనచాయముఖంలో కళ్ళు మెరుస్తున్నాయి. ఒంటికి జ్వరం తగిలినట్టయింది. దగ్గరికి వెళ్ళి కళ్లలో కళ్ళుపెట్టి చూసిందామె. కళ్ళనిండా ఏదో ద్వేషం. డబ్బుకోసం ఒళ్లమ్ముకునేదానికింద లెక్కగట్టేదన్న మాట. అదన్నా నయం. తల పగిలిపోతోంది. అద్దంలో ఫోటోలు కనిపించాయి. గీజరువేసింది రత్నం. ఆమె స్నానాల గదిలోకి వచ్చింది. జుట్టు విరబోసుకుంది. నూనెతో తళతళలాడుతోంది. నుదిటికి కొంచెం నూనె అంటుకుంది. బిళ్ల పస్జేసిందా? నీలం రంగు ప్లాస్టిక్ స్టూలు ముందుకు లాగింది రత్నం. ఆమె కూచుంది. చీర నడుం దగ్గర దోపుకుంది రత్నం. ఆమె లేచి గోడదగ్గర స్టీలు హేంగరు దగ్గర నుంచుని తలమీంచి నైటీతీసి వచ్చికూచుంది. రత్నం గతుక్కుమంది. ఆమెనెప్పుడూ నగ్నంగా చూళ్ళేదు. జాంపండులాంటి ఒళ్ళు. మెళ్ళో నల్లపూసలు, మంగళసూత్రం. తనకి తెలిసిన ఏ పువ్వూ ఇంత బాగాలేదు. ఫోటోలో బేగం ఇంత బాగులేదు. కాళ్ళు దగ్గరకి జరిపి కూచుని కళ్ళు మూసుకుని 'ఊ' అందామె. రత్నం కళ్ళు వేడెక్కిపోయాయి. నగ్నంగా ఇంత బావుంటారన్నమాట. బేగం తిత్తి. సీసా తీసి ఆమె నెత్తిమీద నూనె వేసి చేత్తో జుట్టుపాయలకి రాస్తోంది రత్నం. ఎక్కడా తెల్ల వెంట్రుకలేని మెత్తటి జుత్తు. తల్లోంచి వస్తున్న నల్ల సెలయేరులా వీపు మీదికి జారుతోంది. నూనె వీపుకి రాసింది రత్నం. మెడనుంచి పిరుదులవరకూ వీపంతా రెండుసార్లు రాసిందామె. తల పగిలిపోతోంది. ఆమె చేతులు వేడిగా ఉన్నాయి. అలమరలోంచి పిండి తీసుకుని ముందు వీపంతా పట్టించింది. ఆమె కళ్లు తెరచి స్టీలు గిన్నెలోంచి చిన్నముద్ద తీసుకుని ముఖానికి రాసుకుంది.

ముందుకొచ్చి ఒంగి తడిపిండి మెడకింద, భుజాలు, రెండుచేతులూ తీరిగ్గా దట్టంగా రాసింది రత్నం. మెడ కిందిభాగం, కడుపుదగ్గిర, నడుం, తొడలు, కాళ్ళూ, పాదాలూ మందంగా సువాసన పిండి పట్టించింది.

అసల్నీకు బుద్ధిలేదు. ఎవడు ఆటోమీద షికార్లు తిప్పితే ఆడితో లేచిపోతానా? నీ బుద్ధి మంచిదయితే బానే ఉండేదానివి'.

రత్నంకడుపు దడదడలాడింది. ముఖంతో సహా ఒళ్ళంతా లేతపసుపు రంగులో ఉంది. వెనక్కి వెళ్లి వీపు రుద్దడం మొదలు పెట్టింది. మెడకింద నుంచీ భుజాల వరకూ మృదువుగా ఇష్టంగా రాస్తుంటే రత్నం చేతికింద మెత్తటి గింజల్లాంటి పిండి రాల్తోంది. నలుగుపెట్టిన చోటంతా వీపు కందిపోయింది. అయగారు బానే ఉంటాడు గానీ కొంచెం పిసరు మోటుగా ఉంటాడు. 'వీపంతసేపే?' నిశ్శబ్దంగా ఆమె చేతులు వీపుకింద భాగాన్ని రాస్తున్నాయి. మళ్ళీ పైనుంచి ఒకసారి రాయాలనిపించింది. పెదాలు తడి చేసుకుంది రత్నం. ఈసారి రెండుచేతులూ పైకీ కిందకీ బలంగా రాస్తోందామె. కాసిం ఎదవతో తిరిగి వెడిపోయాడు. రోజూ తాగడవే. ఎవరితోనో తిరుగుతున్నాడు. కాసిగాణ్ని పిల్చేను. బిర్యానీ చెయ్యి. బాగుండాలి. నే జెయ్యి ఆ యధవని రానివ్వద్దని చెప్పు. "ఆడేం జేశాడే నిన్ను? ఏంది పెళ్ళాం లెక్క వాగుతుండావ్?" మటన్ దెచ్చినా. మంచిగ జెయ్యి. ఇరగదీస్తా. తెల్లారి ఆటో కడిగినవా? అరగంటలో ఇద్దరూ సీసాలు తెచ్చుకుని ముందు గదిలో కూచున్నారు. బిర్యానీ, సిగరెట్టు, సారాయి వాసనల పొగలు రత్నాన్ని ముంచెత్తాయి. ఆడు బిర్యానీ తింటున్నాడో నన్ను తింటున్నాడో తెలీలా. బట్టలూడిపోయే ఎదవచూపులు. గంటన్నర తిన్నారు. తేంక్సు. మళ్ళీ ఓసారి పిలాలిమరి. ఇంత కమ్మటి బిర్యానీ ఎప్పుడూ తిన్లా. మావోడి అదృష్టం. భుజం రాసుకుంటూ బయటికి పోయాడు. ఏడుస్తా కూడూ పెట్టేవు. ఏవైంది తక్కువ నీకు? బలంగా బుగ్గలు నొక్కేడు జమీలు. వళ్ళూడినంత వనైంది. పొగరుబట్టిందే నీకు. 'కొంచెం నీళ్ళు చిలకరించు. చేతులోసారి మళ్ళీచెయ్యి' నీళ్ళ చుక్కలు చల్లి భుజంనుంచి మణికట్టువరకూ రుద్దింది రత్నం. ఆమె రుద్దినకొద్దీ కుబుసం విడుస్తున్నట్టు ఎర్రబడుతోంది.

జమీలు చెయ్యిబడితే అంతే. కొరుక్కుని మాంసం ముక్కలు తినేస్తాడు. జమీలు కొండచిలువలా ఆమెను వెనక నుంచి వాటేసుకున్నాడు. 'స్స్. మెల్లిగా' రత్నం చేతులామె భుజం మీద వాతలు తేలేయి. కొంచెం నీళ్ళు చిలకరించింది. రత్నం కూచుని పాదాల దగ్గిర్నించీ మోకాళ్ళవరకూ గట్టిగా రుద్దడం మొదలుపెట్టింది. ముద్దొచ్చే మోకాళ్ళు. రెండు మోకాళ్ళ మీదా మెత్తగా గుండ్రంగా రాసిందామె. పిక్కలు మెత్తగానూ గట్టిగానూ ఉన్నాయి. తాగి మీదకి రావద్దని చెప్పలే? బుద్ధిలేదా? మనిషిననుకున్నావా, దున్నపోతుననుకున్నావా? లెగు ముందు. ఒంటిమీద ఆటో పడ్డట్టయింది. లెయ్-"మంటగా ఉందే", రెండోకాలి దగ్గరికి జరిగిందామె. కాటుకలాంటి పిండి మంటబుడితే జమీలు చెయ్యి వచ్చుడిబండ మాదిరుంటుంది. "పాదాలు కాసేపు రుద్దు-మెల్లిగా. జెరవా, చేతులంత వేడిగా ఉన్నాయేంది?" పెదాలు తడుపుకుంది రత్నం. తల ఒంచితే పగిలేట్టు ఉంది. బయటికి పోయి మర్నాడు రాత్రిగాని రాలేదు. ఆటోలైటు లోపల పడి శబ్దం గోడకి తగిలి ఆగిపోయింది. అన్నం గిన్నె దించి వచ్చింది. మూకుట్లో గుడ్లు ఉల్లిపాయలూ వేగి ఉన్నాయి. ఏం మాట్లాళ్ళేదు. లుంగీ కట్టుకుని బయటి బాత్రూంలో స్నానం చేసి ఒచ్చేడు. మంచం పక్కన రెండు బీరు సీసాలు పెట్టుకొని కాళ్లు బారచాపి గోడనానుకొని "ఏందా చూపు. ఒపనరియ్యి." పెద్ద గుక్క తాగి మంచం పక్కన పెట్టాడు. ఆ సంచీలో కవరుంటది. ఎత్తుకొచ్చి పక్కన కూచో. ఏం? కూచో ఏహె. గ్లాసీ. చల్లగుంటది. కొద్దిగా తాగు. కిక్కిచ్చేదిగాదు. కూచో." ఫొటోలు కవర్లోంచి తీసి ఒక్కోటీ చూస్తూ ఒకటే నవ్వు. చూడు. నీకోసవే తెచ్చేనియ్యి. ఇదో దీన్ని జూడు. పది ఫొటోలు. గొంతు తడారిపోయి గుండె ఆగిపోయింది. చీ చీ. ఇటువంటి ఫొటోలు దిగినోళ్లేం మనుషులు. మగా ఆడా, ఆడోళ్లు, మగోళ్ళు, ఆడోళ్ళు మొకం మీదేసుకో. చీ... అయినా ఒంటికి జ్వరం వచ్చినట్టయింది. ఒక్కో ఫొటో దిగితే ఎంతిస్తారో తెల్సా నీకు? బీరుదాగు, కోపం పోద్ది. ఇది జూడు. చూడేవవుద్ది? దీంది బెజవాడే. సరిగా జూడు బేగం. బాగుందా? ఆదెవడో హైద్రాబాదోడు. తొడల మీద నీళ్లు జల్లింది రత్నం." కొంచెం మెల్లగా." రత్నం చేతుల్లో ఆమె ఎడమ తొడ కుబుసం విడుస్తోంది. మెత్తగా గట్టిగా నున్నగా. దానికెంతిస్తారో తెల్సా. వెయ్యి రూపాయిలు ఫొటోకి. ఆఖరి గుక్క ఏసుకో. తలుపేసిరా. ఇదో ఈ ఫొటో



జూడు. నీ సంగతి నే జూస్తా. కళ్ల మీద ఫోటో పెట్టేడు జమీలు. ఆమె కళ్లలోకి వెళ్లిపోయింది ఫొటో. సర్లే. ఏం కూర! చెరో కంచం ఒళ్లో పెట్టుకొని మంచం చివర కూచున్నారు. అన్నం దిగడం లేదు. అన్నం కలుపుతున్న చెయ్యి ఒణుకుతోంది. 'ఇగో కళ్ల మీద ఇట్టా చెయ్యేసి పడుకో. మొకం తెలీదు. రెండే రెండు ఫొటోలు. సరేనా? దేవుడు బలే బాడీ ఇచ్చేడే నీకు' చేతికింద మెత్తగా హాయిగా నలుగుతోంది తొడ. ఓ చేత్తో పిండి తీసింది. పిండి పిసికినట్టు పిసుకుతున్నా వేమే? మళ్లీ తొడ లోపలిభాగం రెండు చేతులతో రాస్తోంది. ఆమె వేడి నిట్టూర్పులకే కందిపోయేట్టుంది. ఎవరికీ తెలీదని చెప్తున్నాగా' నువ్వెవడికి తెలుసు. ఆడ పనిమానెయ్. చీరలు కొనుక్కో. నేనీడే ఉంటా. పగలే. ఏం తెలీనట్టు ఒస్తాడు. తెగ బాద పడిపోతావేంది? 'నోరుముయ్యి'. కింద చాపేసుకొని పడుకుంది. 'ఇంతలో ఏం పోద్ది? మనిద్దరం ఉన్న పొటోలయితే బోలెడ్డబ్బులు. నేనేగా? కళ్లు మూసుకో. ఆడా మూల నిలబడతాడు. నీకాపద్దు.' రాత్రి నిద్దర్లేదు. ఉదయం కవర్లో పెడుతూ ఫొటోలు మళ్లీ చూసింది రత్నం. రెండోకాలు. మోకాలి దగ్గర్నుంచీ నడుం వరకూ పిండి నలుగుతోంది. పై నుంచీ కిందికి. తొడకి అటూ ఇటూ. 'పిసక్కే. మెల్లింగా రుద్దు.' పిండి గింజలు వేడిగా చేతుల కింద నలిగి రాల్తున్నాయి. 'నడుం రాయి ఓసారి.' మర్నాడు మధ్యాహ్నం కొత్త కుర్తా చుడీదారు తెచ్చేడు. 'ఏస్కో'. ఒద్దేటి, ముందేసుకో... అద్దీ. నీకేడ్రస్సయినా బాగుంటది.' ఏదో ఉంది! వెళ్లిపోయాడు. 'ఏవే. రావనుకున్నాను. బొచ్చెలన్నీ తోవుకోవాలా వద్దా అనుకుంటున్నాను.' ఎన్ని బొచ్చలు? అవి తోవుకోపోయినా ఏం గాదు. ఉదయం తడిగుడ్డ పెట్టి వెళ్లింది. నేల మెరుస్తోంది. పనేం లేదు. ఒంటిరంగులో కలిసిపోయే కనకాంబరం చీర. సోఫాలో వెనక్కి వాలి కూచుని కాళ్లు ఎడంగా బారజాపింది. ఇలాగే కూచుంది బేగం. బట్టల్లేవంతే. 'అదేవిటే అలా చేస్తూన్నావు?' ఏం లేదండి.'

సాయంకాలం ఇంటికెళ్లి పొయ్యి వెలిగించింది. ఒంటినిండా ఫొటోలు కలిసిపోయాయి. టీవీలో పాటలు చూసి ఉడకేసుకున్న అన్నం రెండు ముద్దలు తిని సినిమా చూస్తూ కూచుండిపోయింది. పదిగంటలకి ఆటోలైటు తలుపు సందులోంచి లోపల పడింది. మరో నిమిషంలో సీసాల సంచీ భుజానికి తగిలించుకొని ఒచ్చేడు. 'సినిమా చూస్తున్నావా? ఇదేం జూస్తావుగానీ మంచి కేసెట్టు తెచ్చా.' ఎక్కడో నున్నగా గడ్డం గీయించుకొని ఒచ్చేడు. లుంగీ చుట్టుకొని కూచున్నాడు. లేచి మంచం మీద కూచుంది. తాగి ఏం చేస్తాడో ఇప్పుడు. 'మళ్ళీ నలుగెందుకే?' ఇక్కడంట లేదండి. రెండు చేతుల్నిండా పిండి తీసుకుంది రత్నం. 'మీరు తోవేసుకున్నాక ఆ సబ్బుముక్క ఈయండమ్మా.' 'ఏడిసేవు. అదెంతో తెలుసా నీకు. అదొటే తక్కువ నీకు'. ఆమె తొడల్నిండా దట్టంగా పట్టిస్తోంది పిండి. పిండీ తొడలూ మెత్తగా వేడిగా ఉన్నాయి. పొత్తికడుపుమీద నీళ్లు జల్లి గుండ్రంగా రుద్దుతోంది. పిండిగింజలు వేగుతూ రాల్తున్నాయి. మంచం మీద అటువేపు తిరిగి పడుకుంది. బయటికి వెళ్లి వచ్చాడు జమీలు. ఏంది నిద్రే. లేలే. బోల్డు పనుంది. నవ్వేడు. గడ్డం మాంచి వాసనేస్తోంది. గ్లాసులోకి నీళ్లు బ్రాందీ పోసుకున్నాడు. మంచం మీద కూచుని పెద్ద గుక్క తాగేడు. రెండు చుక్కలేసుకో. కమ్మంగ నిద్రపట్టుద్ది. తిరుగిటు. నోరు తెరవ్వే మాయమ్మా. ఛీ. చీఛీ. లేచి తలుపు దగ్గిరిగా వేశాడు. గ్లాసు ఖాళీ చేసి మంచం కింద పెట్టేడు. ఓ.కే.రా. ఏందిది. ఛీ. మణిసివేనా? తలుపు. తలుపు. ఇప్పుడేంజేస్తావ్? జమీలు వేడి సబ్బు ఒళ్లు ఆమెకి అతుక్కుపోయింది. నవ్వేడు. పోన్లే నా మొహం జూడమాక. కళ్లు మూసుకో. నోరు సున్నాచేసి విజిలేశాడు. ఒంగి ఆమె ముఖాన్ని తన ముఖంతో కప్పేశాడు. తలుపు. తలుపు. చూసుకుంది. ఎవరు? జమీలు ఆమెని కొండచిలువలా చుట్టుకున్నాడు. చటుక్కున అతని మొహం పక్కకి తోసేసింది. సన్నగా నల్లటి చొక్కా పేంటూ. మంచం కాళ్లవేపు గోడ దగ్గిర నుంచొన్నాడు వానపాము. కెమెరాలోంచి ఇద్దర్నీ చూస్తున్నాడు. ఎవడ్రా నువ్వు ఎదవా. నీచపెదవా. జమీలు వీపు సన్నగా చీరుకుపోయింది. తప్పించుకొని మంచం

# ఎన్ కౌంటర్

## హెచ్చార్కె

నేరుగా చూడొద్దు అవతలి మనిషి కళ్లల్లోకి
నేరుగా విసరొద్దు కత్తిని
ఒకదాని పక్కనొకటి ఒకదాని మీదొకటి
రేకులు రేకులుగా మాటల వల పన్నాలి.

పంట చేలో జొన్న కర్రల్లా నిటారుగా నిలబడి ఆకాశానికి మొక్కగూడదు
నలుగురు నడిచే బాట పక్కన ఆకుల్లో పొదల్లో అణిగి మణిగి వుండాలి
తగిన రంగులు తగిన వాసనలు వెదజల్లి మనిషిని లోపలికి రప్పించాలి
లోపలికి వచ్చెయ్యగానే ముడుచుకోవాలి మాంసాహార పుష్ప దళాలు

అహింసపై అనర్గళంగా ఉపన్యసించు, అహింసను ప్రబోధించు, ప్రవక్తించు
నీ అంగట్లో సరుకును నువ్వు తింటానికి కాదు, లాభానికి అమ్ముకోడానికి
నీ ఉపన్యాసం, నీ ప్రబోధం, ప్రవక్తృత్వం నువ్వు అనుసరించడానిక్కాదు
అవన్నీ నీ నియంత్రణ సాధనాలని ఒక్క క్షణమైనా మరవకు

హింస ఎప్పుడూ వుంటుంది. హింస నీ డైనింగ్ టేబుల్
నువ్వు పెట్టే హింసలన్నీ నువ్వు పడే హింసలుగా పాటలు కట్టి పాడాలి
పాటలు విని హింస పడేవాళ్లు పాము పడగల్లా వూగిపోవాలి
తమ మీద హింసను తాము చక్కని నాటకంగా చూడగలగాలి

యుద్ధం ఎప్పుడూ వుంటుంది, అది నీ పోషకాహారం, అదెట్టా వుండాలంటే
జర్మనీలో యూదుల్ని తంతే మధ్యప్రాచ్యం వెల్లకిల పడినట్టుండాలి
యుద్ధం ఎప్పుడూ ఆగిపోకూడదు, మనిషికి విరామమిస్తే ఆలోచిస్తాడు
లోపలికి రాకుండానే మకరందం సేకరించుకునే దారులు కనిపెడతాడు

అవతలి మనిషిని నిట్టనిలువున చంప దల్చుకున్నప్పుడు,
అతడిని తర్కంలోకి దించి మాటల్లో పెట్టాలి
సర్దాగా కత్తి మడిచి జేబులో పెట్టుకున్నట్టుండి
చటుక్కున తెరిచి, అవతలి మనిషి గొంతు కోసెయ్యాలి

మీంచి జారి నేలమీద చీరందుకుంది. వానపాము మెళ్లోంచి కెమేరా జారిపోయింది. చీర చుట్టుకొనేలోగా జమీలు జుట్టుపట్టుకొని మంచం మీదికి లాగబోయాడు. ఇద్దరికీ బట్టల్లేవు. జుట్టు అలాగే పట్టుకొని మంచం మీదకి తోశాడు. చెయ్యి విదిలించిందామె. పిడికిలి బిగించి కొట్టేడు జమీలు. జారి మంచానికి తగిలి పడిపోయిందామె. కళ్లు మూసుకుని కాళ్ళు ముడుచుకు పడుకుందామె. చచ్చిందేమో అన్నాడు వానపాము. చంకన కిందనుంచీ నడుందాకా రెండుసార్లు రుద్దింది రత్నం. మెడకిందనుంచీ బొడ్డువరకూ కిందికీ పైకీ. వేడి పేలాల్లాగ పిండి రాల్తోంది. రుద్దించుకోటానికేం రోగం? 'మెల్లిగా. నలిపేస్తన్నావు.' ఈ ఫొటో బావుంటుంది. బేగంస్నానం చేస్తున్న ఫొటో ఉంది. కాశిం గాడికీవిడ కనిపించలేదేమో. వెయ్యేంది ఎంతేనా ఇస్తారు. సినిమా హీరోయిన్లెందుకు పనికొస్తారు. మెత్తటి వెచ్చటి రబ్బరులాగ అరచేతుల కింద ఒళ్లు హాయిగా ఉంది. 'స్స్స్.. మెల్లింగా చెవుల ఎనక చూడు.' జమీలు మోకాళ్లకింద నడుంకింద చేతులేసి లేపి మంచం మీద పడుకోబెట్టి కాళ్ళు లాగేడు. వానపాము మళ్లీ కెమేరా తగిలించుకొని మోకాళ్లమీద కూచున్నాడు.

రెండు చెవుల వెనకా పిండితో మృదువుగా రుద్దింది. ఏవుంది? ఏవీ లేదు. ఒంటికి, ఇంటికి, కాళ్లకి గూడా మట్టి అంటదు. అరికీళ్లు నాకినా ఏం కాదు. చర్మం ఊడేట్టు నలుగు పెట్టుకొని ఏం జేస్తుందీవె? జమీలుగాడు! కాశింగాడూ బేగంమీద పడ్డట్టు పడితే మట్టీ గిట్టీ ఏం ఉండదు. మూడుగుడ్లు. ఉంకో గుడ్డేస్తే ఏం పోద్దో. అట్లా పక్క ఒత్తిగిలి మళ్లీ బిగునుకుపోయింది రత్నం. కెమేరా సరిజేసుకుంటున్నాడు. మీద పడ్డాడు జమీలు. బలంగా భుజాలు పట్టుకొని వెల్లకిలా తోస్తున్నాడు. చటుక్కున ఆమె జమీలు చెంపమీద కొట్టింది. లంజికనా. ఆమెని నొక్కి పెట్టడానికి అతని బలమైన కాళ్లూ చేతులూ నడుం ఉపయోగపడ్డం లేదు. లేరా యెదవా. బ్రోకరెదవా లైటు ఒక్కసారి మెరిసింది. బలంగా ఆమె పెదాలతో తన పెదాలు బిగించబోయాడు. నన్ను అమ్ముతావా, నీయమ్మ ఫొటోలు తియ్. సిగ్గులేని యెదవల్లారా. ఒదులు. డబ్బుకోసం ఒళ్లమ్ముకోన్రా. ఒదల్రా దున్నెదవా. మరోసారి పక్కనుంచీ లైటు మెరిసింది. ఆమె అప్రయత్నంగా పక్కకి చూసింది. ఆమె భుజం నొక్కి ఒక ఉదుట్న ఆమెని ఆక్రమించేడు జమీలు. రేయి తలేపునుంచి తీయ్. ఒదులు. అరుస్తా. అరవ్వే. రెండు చేతులూ పైకెత్తి బలంగా అదిమిపెట్టాడు జమీలు. మంచం పక్కకి ఒచ్చేడు వానపాము. కళ్లు గట్టిగా మూసుకొని మొహం అటువేపుకి తిప్పిందామె. మళ్లీ కెమేరా వెలిగింది. 'ఇంకచాలు ఆపింక. చర్మం ఊడొస్తుంది.' ఊడితే ఏం? దీన్నితియండ్రా. ఒంటికి అత్తర్లు సెంట్లు పూసుకుని ఎండముకం చూడదు. చూడు. తెల్లంగా మెత్తగా హాయిగా ఉంది. రా. ముందు నుంచుని తియ్యి. నలిపేస్తున్నావే. చాలింక పీక నొక్కెయ్యగలవు.' బేగం బంగారం ఈయమ్మ. రేయి ఇప్పుడెనకనించి తియ్. నన్నొదల్రా. చంపేస్తా. పొటోలొద్దు. నిన్ను చంపి నే చస్తా. లైటు మెరిసింది. నే లొంగను. చంపుతా. రెండు చేతుల్తో గట్టిగా పీక నొక్కుతోంది రత్నం. చావెదవా. చావు. ఎండముకం చూడక ఒళ్లు బలిసింది. ముందునుంచుని బాగా తియ్యి పీకమీద బిగిస్తోన్న చేతుల్ని బలంగా తన చేతుల్తో విడదీస్తున్నాడు జమీలు. చటుక్కున చేతులొదిలి అతన్ని తోసేసింది. చంపుకుంటున్న జంతువుల్లా ఒకళ్లమీద ఒకళ్ళు పడ్డారు. కెమేరా మెరిసింది. అమ్మో. ఒదులు ఒదలవే... నగ్నంగా నుంచుని రొప్పుతోంది. వానపాము పారిపోయాడు. నోరు తెరచి ఆమె నిర్జీవంగా స్టూలుమీంచి జారి కిందకి పడిపోయింది.

# నా యింటిరోడ్డు

## రేపాక రఘునందన్

నా యింటిరోడ్డు శ్వాసిస్తూనే ఉంది
దేహమంతా గతుకుల గాయాలతో ....
హృదయంలో సూదంటు రాళ్ళని
నిక్షిప్తం చేసుకుని మూలుగుతూనే ఉంది.
నాగరికత చిహ్నానికి
నిదర్శనంగా
గతకాలపు ప్రాణంతో
రోజురోజుకి
బీటలు వారుతూ
అంచులమధ్య
దూరాన్ని పెంచుకుంటూ
నరకయాతన అనుభవిస్తోంది....
కలలతో సేద తీరేవేళ
ప్రొక్లైయిన్ గుండెలోతుల్ని తొలిచేస్తున్నా
ఆత్మీయరాగమేదో
అలపిస్తుంది...
మూగరోధనలతో
హృదయం స్పందించుకుంటుంది....
జ్వలిస్తున్న క్షోభని
పంట నొక్కిపెట్టి
ఏళ్ళ తరబడి వారసత్వాన్ని
వదులుకుంటుంది...
గతకాలపు అవశేషాలను
మోస్తున్న వాళ్లని
ప్రేమగా స్పర్శిస్తూ
ప్రజాసేవలో
సౌకర్యాల పునాదిపై
ప్రణమిల్లుతుంది....
తనదేహం పరిచినచోట
మన అవసరం తీరుస్తుంది
పాదముద్రల సవ్వడితో
తన హృదయాన్ని
పులకరించుకుంటుంది.....
ఎగసిపడే బాధా కెరటాల
శిఖరాగ్రంపైనిలబడి
ఊపిరాడక స్తబ్ధుగా ఉండిపోతుంది...
తన అస్తిత్వాన్ని తడుతూ
విరామమెరుగక
మౌనాన్ని అనుభవిస్తుంది
మెత్తని కలలను
శతాబ్దాల తరబడి
చీకటి రెప్పలకింద
స్థిరంగా దాచుకున్న
నిలువెత్తునిదర్శనం
నా ఇంటిరోడ్డు...
రాత్రివేళ
భయంతో అడుగుల వేగం
ఆగిపోతున్న బాధాతప్తులకు
బాసటగా నిలవడమే కాక
ధైర్యంతో ముందుకు నడిపిస్తుంది....
నిరంతర జీవనంలో
నిశ్చల చిత్రం
నా ఇంటిరోడ్డు...
నిలువెల్ల గాయాలతో
నిద్రని త్యజించి
జీవన పథంలో
మారుతున్న కాలాన్ని చూసి
జ్ఞాపకాలను ఆస్వాదిస్తూ
కనిపించని అశ్రువుల్ని
దుప్పటిగా కప్పుకుని
స్వార్థపరులైన కాంట్రాక్టర్ల
కనుసన్నలలో
కన్నీరౌతుంది
నా ఇంటిరోడ్డు.....